

# స్వేచ్ఛ బోర్డు

పైడిపాల



శేఖరం రోడ్డుమీద నడుస్తున్నాడు.

రోడ్డుమీద నడుస్తున్న చాల మందిలో శేఖరం ఒకడు అయినా శేఖరం నడక గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి అంటె అతను కాళ్ళు పైకి తలక్రిందికి పెట్టి సర్కస్ ఫీట్లు చేస్తాడని కాని, కాలేజి అమ్మాయిల వెంటబడి రికార్డింగ్ డాన్స్ షోజులో వంకర్లు పోతాడని కాని కాదు మూడు రోజులు... ఐదు రోజులు ... పది రోజులు ... నెల...ఇలా సైకిలు తొక్కే మనుష్యుల్లా శేఖరం నాలుగు సంవత్సరాల నుండీ రోడ్లు వెంబడీ తిరుగుతున్నాడు. ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ వగైరాలేను చేసుకొనకుండానే శేఖరం రూట్‌మార్చ్ సంగతందరికీ తెలిసిపోయింది.

శేఖరం కనిపిస్తే మిత్రులు అవసరం లేకపోయినా ఏ కాఫీ హోటళ్ళల్లోకో దూరతారు. పరిచయస్థులు మొహాలు ఎక్కడికి తిప్పుకుంటారు. కాలేజి అమ్మాయిలు అతనికేసి సానుభూతితో చూస్తూ వెళ్ళిపోతారు. శేఖరం అందగాడనే చెప్పుకోవాలి శేఖరం తెలివైన వాడుకూడా దానికతని బి యస్సీ ద్వితీయశ్రేణి పట్టు గీటురాయి కాకపోవచ్చును గాని కాలేజి ప్రిన్సిపాల్‌తో సహా సర్వులూ అంగీకరించిన సత్యం అది

నాలుగు సంవత్సరాల నుండి శేఖరం అకుంఠితమైన దీక్షతో రోడ్లు సర్వే చెయ్యడానికి ఒకే ఒక కారణం. అతనికుద్యోగం కావాలి. ఆమాట కొస్తే ఇండియాలో చాలామంది ఉద్యోగాలు కావాలి. కాని శేఖరానికి తాను చాలమంది కంటె విలక్షణమైన వ్యక్తినని గొప్ప ఆత్మ విశ్వాసం సర్టిఫికెట్ విలువ కాకుండా తన వ్యక్తిగతమైన యోగ్యతమీద గొప్ప నమ్మకం ప్రతి యింటర్వ్యూలోనూ అధికార్లను వాళ్ళు కోపించుకున్నంతవరకూ తన గురించి బోరతాడు. వాంటెడ్ కాలమ్స్‌లో పడిన, అర్హతవున్న ప్రతి ఉద్యోగానికి మామూలు సర్టిఫికెట్లతోబాటు కనీసం ఆరు పేజీల పెర్సనల్ లెటర్ జతపర్చి దరఖాస్తు దాఖలు చేస్తాడు. ఏ క్రొత్తసంస్థ ప్రారంభోత్సవం జరిగినా పూజారితోబాటు తనూ సిద్ధం. ఇలా తపాలా శాఖ వారికి యథాశక్తి వాయిదాలమీద ముడుపు చెల్లిస్తూ విసుగు చెందని విక్రమార్కుడిలా శేఖరం నాలుగు సంవత్సరాల నుండి రోడ్లమీద నడుస్తున్నాడు.

గతం మాటెలాగైనా ప్రస్తుతం శేఖరానికి తప్పనిసరిగా ఉద్యోగం కావాలి. లేకపోతే చదువుకుంటున్న ఇద్దరు తమ్ముళ్ళు వీధినపడి ఏ జేబు దొంగలుగానో తయారవుతారు. వయసొచ్చిన చెల్లెలు ఎవడితోనో లేచిపోతుంది. మంచం పట్టిన తల్లి కాస్తా 'హరీ' మంటుంది. (శేఖరానికి జ్యోతిష్యం రాదు) ఈ మూడేళ్ళుగా ఎలాగో నెట్టుకొస్తున్న ముసలి తండ్రి కాస్తా మొన్నతః బరువుమొయ్యలేక చిద్దకించాడు. ఇప్పుడుద్యోగం రాకపోతే.

ఇప్పుడిప్పుడు శేఖరానికి రచయితలంటే మంట. కొన్ని సినిమాల్లోను, నవలల్లోను కాఫీ హోటలు సర్వర్‌ని (హీరో పాత్ర) కూడా లక్షాధికారి కూతురు ప్రేమించేసి అష్టకష్టాలు పడి పెళ్ళాడేస్తుంది. అలాంటిది సన్నగా యెర్రగా పొడవుగా వుండే ఆరడుగుల విగ్రహం తనకే కాలేజి అమ్మాయి కనీసం ప్రేమలేఖైనా రాయలేదు. అధమం పైకిదువ్విన పల్చని జుట్టులోంచి నుదుటిమీదకు చెదిరిపడే ముంగురులనూ, సూదంటు రాయిలాంటి ముక్కుని చూసైనా తప్పి ఏ అధికారి కూతురైనా ప్రేమించి, పెళ్ళిచేసుకోపోయినా ఉద్యోగమైనా యిప్పించకూడదూ. 'ప్రేమ' అనే పదమే శుద్ధఅబద్ధం.

నెల్రోజులక్రితం స్థానికంగా నిర్మించిన 'శ్రీ వెంకటేశ్వర షుగర్ ఫ్యాక్టరీ'కి ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది. ఆ ఫ్యాక్టరీలో పనిచెయ్యడానికి విటమిన్ 'ఆర్' ఉన్న అభ్యర్థులను చాల మందిని తీసుకుంటున్నారట. శేఖరం కూడా స్టేట్ లెవిల్ మనిషి గనుక ఆ ఫ్యాక్టరీ మేనేజరుగారి ఆస్తి వర్గాన్నంతటినీ పరిశీలించి చివరకు ఎమ్మెల్సీ మాటా రెడ్డిగార్ని పట్టుకొన్నాడు. ఎలాగో కాకాశాస్త్రాలు ప్రయోగించి ఆయనదగ్గర ఆ 'విటమిన్ ఆర్' కాగితాన్నికాస్తా సంపాదించాడు. దాన్నిభద్రంగా ఫైల్లో పెట్టుకొని బ్రహ్మాండమైన నమ్మకంతో ఓ ఫైన్ మార్నింగ్ మేనేజరుగారి దర్శనార్థం బయలుదేరాడు అందుకే ఈరోజు శేఖరం రోడ్డుమీద ఉత్సాహంగా నడుస్తున్నాడు.

* * *

ఫ్యాక్టరీ తనకు సుపరిచితమే గనుక సరాసరి మేనేజర్‌గారి క్వార్టర్స్‌కి వెళ్ళాడు. అదృష్టమేమిటో గాని ఆయన తీరుబడిగా కూర్చొని వున్నారు అప్పుడనుకున్నాడు శేఖరం బయల్దేరేటప్పుడే కుడికన్నదిరిందని. జ్యోతిషాన్ని శకునాల్ని అతను నమ్మడు గాని కలిసొచ్చేలా వుంటేమాత్రం నమ్మితే పోయిందేమనుకుంటాడు. శేఖరానికి దారుణంగా నమ్మకం పెరిగిపోయింది, తప్పకుండా వుద్యోగ మొస్తుందని.

వెళ్ళాన మేనేజర్ గణపతిగార్కి సాష్టాంగదండ ప్రణామం చేసినంత పనిచేశాడు. కూర్చోమని కుర్చీచూపించినా అతి వినయంతో నిల్చునే దండకం మొదలెట్టాడు శేఖరం.

"నా పరిస్థితి మీకు తెలుసు. మొన్ననే నాన్నగారుకూడా పోయారు. చెల్లాయి కిప్పుడు యేదో సంబంధంచూసి పెళ్ళి చెయ్యాలి. తమ్ముళ్ళిద్దర్నీ మెట్రిక్యులేషనయినా పూర్తి చేయిస్తే వాళ్ళదారి వాళ్ళు చూసుకుంటారు. అమ్మకి మందుల కోసం చాల డబ్బు ఖర్చవుతుంది. ఇల్లుకూడా తనఖా పెట్టాం. మీరు నా మీద దయుంచి ఉద్యోగమిప్పిస్తే కష్టాలు గట్టెక్కుతాయి. ఉద్యోగానికి కావలసిన క్వాలిఫికేషన్ కూడా వుంది నాకు..." ఇన్నాళ్ళ అనుభవంతో హృదయం ద్రవించేలా మాట్లాడ్డం శేఖరానికి బాగా చాతనవును.

శేఖరం. విన్నుచూస్తే నాకూ జాలేస్తుంది కాని మీ లాంటి వాళ్ళు దేశంలో చాలముందున్నారు. ఎంతమందినని ఆదుకోగలం చెప్పు" ఆయన కూడా జాలి ఒలక బోస్తున్నాడు.

"మీ వంటి తెలిసిన వాళ్ళు సహాయం చెయ్యక పోతే యెలా చెప్పండి. మాచారెడ్డిగార్ని కూడా కలుసుకున్నాను, మీరు కరుణ స్వభావులని - తప్పక సహాయం చేస్తారని చెప్పికూడా వుత్తరం కూడా రాసిచ్చారు." ఫైల్లో పెట్టిన 'విటమిన్ ఆర్' ని జాగ్రత్తగా ఆయన కందజేశాడు.

"మాచారెడ్డిగార్కి నేనంటే చాలా అభిమానం. వాళ్ళింట్లో చాలా చనువుగా వుంటాను. రాజ్యలక్ష్మి గారు కూడా నన్ను యింట్లోవాడిలా చూసుకుంటారు. మీరంటే ఆయనకు చాలా గౌరవం. మీ రొద్దనబట్టిగాని ఈ పాటికి మినిష్టరయి వుండే వారని చెప్తుంటారు. మీ రిద్దరూ చిన్న తనంనుండీ స్నేహితులట కదండీ" గణపతి వుత్తరం చదువుకున్నంతసేపు శేఖరానికి మాచారెడ్డిగారి గురించి యేదో చెప్పాలనే తాపత్రయం.

'చూడు శేఖరం. నువ్వు నిజాయితీ పరుడివి. ఇలా మరొకళ్ళచేత కాగితాలు రాయించడం అంత బాగుండదు. మాచారెడ్డిమాత్రం అవసరమొచ్చి నప్పుడు యిలా వుత్తరాలు రాస్తూంటాడు గాని గత ఎన్నికల్లో తనదారితను చూసుకోలేదూ." కాగితం మడిచి పేపర్ వెయిట్ క్రింద పెడుతూ మృదువుగానే చెప్తున్నాడు.

డామిట్ ! కథ అడ్డం తిరిగింది!

"ఓహో, అదాండీ. మరెవరితో అనకండి ఆయనకు మినిష్టరు అవకాశమొస్తుందని ఆశతో అవతల పక్షంలో వుండి పనిచేశాడు. ఆశ చాలచెడ్డది సుమాండీ. మీలా పదవీవ్యామోహం లేనివాళ్ళెంతమందుంటారండీ! నిజంగా మీకున్న తెలివిక్కి పెర్సనాలిటీకి (నిజం చెపితే పేరుకుతగ్గట్టు) పట్టుకుబడికి మీరు మినిష్టరుగనుక అయితే (అప్పుడుగాని నామసార్థక్యం కాదు) యెంతచక్కగా వుంటుందండీ? ఏం చేస్తాం?.. ఆంధ్రుల కాఅదృష్టం లేదు. వాస్తవం చెప్పుకుంటే గణపతిగారూ, మేధావులు పదవుల కోసం యెగబడరండీ..." కష్టపడి ప్లేటు తిరగేసి పంచమ శ్రుతిలో వాదేస్తున్నాడు.

"ఇదిగో అబ్బాయ్, ఇలా నన్ను పొగడ్డమంటే నాకు సుతరామూ యిష్టం యుండదు." అవతల నుండి బ్రేక్ పడి పోయింది.

"క్షమించాలి. ఇది పొగడ్డంకాదు. సత్యాన్ని చెప్తున్నాను. మీరు నిగర్వులని నిరాడంబరులని నాకు తెలుసు. ఆ మాటకొస్తే నాకేకాదు, యావదాంధ్ర దేశానికీ తెలుసు. 'తెలివి యొకింత లేని యెడ...' అన్నట్టు తమ బోటి మేధావులు తక్కువగానే చెప్పుకుంటుంటారు. పొగడ్తలకుబ్బరు. ..."

"శేఖరం, నాకు యెవరెందుకు యెలా మాట్లాడతారో బాగా తెలుసు. పొస్టుకాళీగావుంటే నేనే యిచ్చేవాణ్ని గా. అనవసరంగా శ్రమపడక వెళ్ళు" శేఖరం బ్రహ్మాస్త్రం కూడా విఫలమై పోయింది.

"అవును మీకు పైకొలజీ బాగా తెలుసని సునీతగారు ప్రసంగవశాత్తు ఉపన్యాసంలో చెప్పారు. కరం కూడొప్పలేదు. కదల్లేదుకాదా!

"నేను సైకాలజీ చదువుకోలేదు" విసుక్కున్నాడు.

"చదువుకోవాల్టండీ వాల్మీకి, కాళిదాసు బమ్మెర పోతన - వీళ్ళంతా చదువుకున్నారా? పోనీ పురాణ పురుషుల విషయం వదిలేసినా యే నాటి రాజకీయ దిగ్గంతులలో చదువుకున్న వాళ్ళెంతమంది చెప్పండి అంతెందుకు? సునీతగారు యేం పెద్దగా చదివారని అవిడిచ్చే వుపన్యాసం ఆ విషయములు మరెవరికైనాసాధ్యమాండీ అటువంటి ఉత్తమ స్త్రీ తమ యిల్లాలుగా లభించడం అదృష్టం (ఎవరిది ) 'కార్యేషు దాసీ' అనిలాక్షిణికులు చెప్పినట్టు ఆదర్శ గుణాలన్నీ మూర్తీభవించిన సౌందర్యరాశి కదండీ ఆమె (నిజానికి గణపతికి మినిష్టర్ పదవి రావడానికి ఆమే కారణమని చాలమంది చెప్పుకుంటారు ) ఆవిడక్కూడా నేనంటే చాలా అభిమానం..." కొంచెం మోతాదు మించే వెళ్తుంది కాకా.

'అంత అభిమానమయితే ఆమెనే వుద్యోగమిమ్మన లేక పోయావ్..."

రంగు మారిన ముఖాన్ని శేఖరం గమనిస్తాడనేమో పక్కకి తిప్పేసుకున్నాడు సునీత తన పడుచు పెళ్ళాం విందులకి వినోదాలకి కలిసి వెళ్ళినప్పుడు అందమైన యువకులు పరిచయమయితే కళ్ళప్పగించి చూడ్డం ఆ తర్వాత వాళ్ళ గురించి తన దగ్గరే పొగిడెయ్యడం బాగా అనుభవమే తనంటే ప్రత్యక్షంగా అయిష్టం చూపించక పోయినా చాటునా మాటునా ఆ విషయం యితరులు చెప్పుకుంటుండగా విన్నాడు అంతే కాదు. ముగ్గురి పిల్లల్లో తన పోలికలు కొట్టొచ్చినట్టుండే చిట్టిబాబుంటే చిర్రుబుర్రులాడుతుంటుంది. ఇప్పుడు నాజూగ్గావుండే శేఖరం మీదగాని కన్నెయ్యలేదు గదా...

శేఖరం వంక చూశాడు శేఖరం కళ్ళల్లో ఆశ అందంగా తొంగి చూసింది.

ఏదో చెప్పబోతున్నట్టు శేఖరం పెదవులమధ్య పలువరస మెరిసింది.

"నన్ను విసిగించకింక. వెళ్ళు" గణపతి కట్టించుకున్న పళ్ళు కదిలేలా కసిరాడు.

"మిదయ, నమస్కారం" వెనుదిరిగాడు శేఖరం

"నమస్కారం అయనకూడా లేచాడు.

శేఖరం ఆశలన్నీ అడియాసలయ్యాయి. ఇంక జన్మలో వుద్యోగం రాదు. కత్తికొద్దీ మాష్టర్ కాకా పట్టాడు. ఇంకా అవకాశమిస్తే బంధువర్గాన్ని వంశాన్ని... పొగిడేవాడే కాని లొంగేపుటంలా లేదు. ఇప్పుడు శేఖరానికి బావురుమని ఏడవాలని పిస్తోంది అమాంతంగా గణపతి కాళ్ళదగ్గరపడి ఆత్మహత్య చేసుకోవాలని పిస్తోంది. లేకపోతే గణపతిని పొడిచిపారెయ్యాలని పిస్తోంది. ఉద్యోగంరాని తన్నుచూసి చెల్లాయి, తమ్ముళ్ళు, అమ్మ-హృదయవిదారకంగా విలపిస్తూ కన్నీటిధారలలో కనిపిస్తున్నారు. అడుగుతీసి అడుగు వెయ్యలేక పోతున్నాడు శేఖరం...

ఎదురుగా మూడేళ్ళకుర్రాడు తప్పటడుగులు వేస్తూ వస్తున్నాడు. వంటినిండా ఖరీదైన బట్టలు నగలు... చీమిడికారుతున్న ముక్కు... పై పెదవి మధ్య కుటించిన తొర్ర... తుమ్మమొద్దులాంటి మొహం. మాణిక్యాలు పొదిగిన మట్టిలావున్నాడు.

శేఖరం మెదడులో మెరుపులాంటి ఆలోచన, అమాంతంగా కుర్రాణ్ణెత్తుకొని. "హాయ్ యంగ్ చార్మింగ్' అంటూ ముద్దులతో ముంచేశాడు శేఖరం చేతుల్లో కుర్రాడు కిల కిలా నవ్వాడు.

కుర్రాడు నవ్వు గణపతి హృదయంలో పెయ్యి గిటార్లను మీటింది, కుర్రాడు తన ప్రతిరూపం, చిట్టిబాబు... సునీతకూడా చీటికి మాటికి చీదరించుకునే కవిష్ఠుడు... తన వరాల కుప్ప ... ముద్దుల మూట...

"శేఖరం, నిన్ను చూస్తుంటే యెలాగైనా వుద్యోగమివ్వాలని పిస్తుంది. రేపు ఆఫీసుకి వచ్చి కనబడు..." గణపతి పెదాలమీద తొణికిన చిరునవ్వులోంచి వెలువడిన మాటల్ని తలపువ్వులుగా ధరించాడు శేఖరం. నమ్మ లేనంతగా ఉక్కిరి బిక్కిరై పోయాడు.

"థాంక్స్" విజయోత్సాహంతో మినిష్టరు గారి కుమారరత్నాన్నెత్తుకొని సినీహీరోలా నిల్చున్నాడు శేఖరం.

★


# ద్వితీయం అఖిల భారత బాలల చిత్రకళా ప్రదర్శనము

ఏప్రియల్ 1972 లో

వివరములు :

1 ఈ పోటీకి 6 నుండి 18 సం॥ వయసుగల అన్ని రాష్ట్రముల బాల బాలికలు స్వయముగా వేసిన చిత్రములు పంపవచ్చును

2. చిత్రము సైజు 30 cm x 20 cm కలిగి ఏ విషయమునైనను రంగులతోగాని, ఇండియన్ ఇంకుతోగాని చిత్రించి ప్రదర్శించుటకు వీలుగా కార్డుబోర్డుపైన మౌంటుచేసి పంపవలయును.

3. చిత్రములు తాము స్వయంగా వేసినట్లు, విద్యార్థులతమప్రధానోపాధ్యాయులచేతను ఇతరులు ఏ బాధ్యతగల వ్యక్తి చేతనైనను ధృవపరచి పంపవలయును. పుట్టిన తేదీ ఇవ్వవలెను, చిత్రము వెనుక చిత్రము పేరు, చిత్రకారుని పేరు, తరగతి, వయస్సు, చిరునామా ఇవ్వవలెను.

4. పోటీ రుసుము ఒక్కొక్క చిత్రమునకు 0 25 పై॥మాత్రమే ఒక్కొక్కరు ఐదు చిత్రముల వరకు పంపవచ్చును పోటీరుసుము పోస్టల్ ఆర్డరు ద్వారాగాని, మనియార్డరుద్వారాగాని చిత్రములతో పాటుగా ది 1.3 1972 లోగా ఈసంస్థ కార్యదర్శికి పంపవలెను

వివరములకు : 0 25 పై ల స్టాంపుతో

శ్రీ వెల్లటూరు పూర్ణానందశర్మ,

వెల్లటూరు (పి ఒ ) వయా తెనాలి,

గుంటూరు (జిల్లా).